కథ

# ఆ చూపు

రాంభూపాల్ రెడ్డి

సికింద్రాబాద్ స్టేషన్ ముందు ఆటో ఆగింది. ఆటో బిల్ పేచేసి లోపలకు నడుస్తూ టైమ్ చూసుకున్నాడు అశోక్. ఐదుగంటలు అయ్యింది.

ట్రైన్ ఎక్కి లోనికి నడిచాడు. సీట్లు ఎక్కువభాగం ఖాళీగానే వున్నాయి. ఒక చోట విండోసీట్ ఖాళీగా కనిపించగానే వెళ్లి కూర్చు న్నాడు. ఎదుటిసీట్‌లో వున్న ఇద్దరు వ్యక్తులను చూడగానే అతని చేతులు బ్రీఫ్‌కేస్ మీద అలాగే నిలిచిపోయాయి. వాళ్లు కూడా అతని వంకే చూస్తున్నారు. ముందుగా అతనే తల తిప్పుకొని కిటికీ వోపెన్ చేసి బయటికి చూస్తూ కూర్చున్నాడు.


కొద్దిసేపైన తరువాత మెల్లగా తలతిప్పి వాళ్లవంక చూశాడు. కిటికీ ప్రక్క లావణ్యా కూర్చుని వుంది. ఆమె ప్రక్క శ్రీధర్ వున్నాడు. వాళ్లిద్దరూ అన్నాచెల్లెళ్లు. వాళ్లదీ అతని వూరే. ఆ వూళ్లో ఆస్తుల విషయంలోకానీ, రాజకీయంగాకానీ బలమైన వర్గాలు వాళ్ల రెండు కుటుంబాలే. అయితే ఆ రెండు కుటుంబాలకూ మధ్య పచ్చగడ్డి వేస్తే ఆనవాళ్లు కూడా మిగలకుండా కాలిపో తుంది. కర్నూలు దగ్గరగా వుండటంతో రాయలసీమ గ్రామ కక్షల వాతావరణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంటుంది.

'అశోక్ ఇంజనీరింగ్ చదివాడు. ప్రస్తుతం ఎమ్.బి.ఏ చేస్తు న్నాడు. శ్రీధర్ కూడా ఇంజనీరింగ్ పూర్తి చేసి ఒక ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. లావణ్య ఎమ్.సి.ఏ చేస్తోంది. క్యాంపస్‌లో అప్పుడ ప్పుడూ అశోక్, లావణ్యలు ఒకరినొకరు తారసపడ్తుంటారు. ప్రస్తుతం వాళ్లు ముగ్గురూ సంక్రాంతికి వూరుకు వెళ్తున్నారు.

రైలు మెల్లగా బయల్దేరింది. శ్రీధర్ పేపర్ చూస్తున్నాడు. లావణ్య కిటికీ లోంచి బయటకు చూస్తోంది.

''కిటికీ మూసెయ్. చలిగా వుంది'' లావణ్య వంక చూస్తూ అన్నాడు శ్రీధర్.

''నాకిలా వుంటేనే ఇష్టం'' అంటూ తల తిప్పి అశోక్ వంక చూసింది.



అదే చూపు. చిన్నప్పట్నుంచీ వాళ్లిద్దరూ ఒకరికొకరు తారసపడ్డ ప్రతిసారీ చూసే చూపు. ఆ చూపులో కోపముందో, ద్వేషముందో మరే భావముందో అతనికింత వరకూ అర్ధం కాలేదు. కానీ ఆమె అలా చూసిన ప్రతిసారీ అతనిలో ఒక విధ మైన అలజడి బయలుదేరుతుంది. ఆమె ప్రత్యర్ధివర్గం అమ్మాయి అన్న విషయం అతను తాత్కాలికంగా మరచిపోతుంటాడు.

నిజానికి అతనికి ఈ గొడవలూ, ద్వేషాలూ ఇష్టం వుండవు. అతను మొదట్నుంచీ ప్రశాం తంగా జీవించడం పట్ల ఇష్టాన్ని ఏర్పరుచుకున్నాడు. రెండు కుటుంబాల మధ్య ఈ కక్షలు సమసిపోయే రోజు కోసం ఆ వూరి ప్రజలతోపాటు అతను కూడా ఎదురు చూస్తున్నాడు.

రైలు లయబద్ధంగా కదులుతూ ముందు సాగిపోతోంది. చల్లగా వుండటంతో అశోక్ కళ్లు మూసుకున్నాడు. అలాగే నిద్ర పట్టింది. అతను మళ్లీ కళ్లు తెరిచేటప్పటికి శ్రీధర్, లావణ్యలు ఇడ్లీలు తింటున్నారు. అతను లేచి బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చాడు. పాలిథిన్ పేపర్‌లో ఇడ్లీలు, చెట్నీ వేసి ''తీసుకో అశోక్'' అంటూ అతనికి ఇచ్చాడు శ్రీధర్. అతనికి ఒక్కక్షణం ఆనందాశ్చ ర్యాలు కలిగాయి. వాళ్లిద్దరూ ఇంతవరకూ ఒకే వూర్లో పెరిగి, ఒకే వూర్లో చదువుకుని, ఒకే వూర్లో వుంటున్నా ఒక్కసారి కూడా మాట్లాడుకోలేదు.

ఇడ్లీలు తీసుకుని మౌనంగా తిన్నాడు. లావణ్య నీళ్ల బాటిల్ ఇచ్చింది. కొన్ని తాగి తిరిగిచ్చే స్తుంటే అతనికి తెలియకుండానే అతని పెదవులపై ఆనందకరమైన చిన్ననవ్వు విరిసింది. వాళ్లు కూడా చిన్నగా నవ్వారు.

అశోక్‌కు ఏం మాట్లాడాలో తెలియట్లేదు. వాళ్లకు కూడా ఈ గొడవలు ఇష్టం లేనట్టుంది. తనతో ఫ్రెండ్‌షిప్ కోరుకుంటున్నారని మాత్రం తెలుస్తోంది.

మధ్యాహ్నాం ఒంటిగంటకు వాళ్ల వూరి స్టేషనొచ్చింది. ముగ్గురూ మౌనంగా రైలు దిగి స్టేషన్ బయటికొచ్చి నిలబడ్డారు.

రైలు దిగి బయటకు వస్తున్న ఆ వూరి ప్రజలు ఒకే చోట నిలబడ్డ ఆ ముగ్గురినీ చూసి వింతగానూ, ఒకింత భయంగానూ చూస్తున్నారు.

ఇంతలో శ్రీధర్, లావణ్యలను రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన జీపుడ్రైవర్ వాళ్ల చేతుల్లోని బ్యాగ్‌లు అందుకున్నాడు.

''నీ కోసం ఎవరూ రానట్టుంది'' అడిగాడు శ్రీధర్.

''అవును. నేను వస్తున్నట్టు ముందుగా ఎవరికీ తెలుపలేదు'' చెప్పాడు అశోక్.

''అయితే మా జీపులో కలిసే వెళ్దాం! రా'' అంటూ శ్రీధర్ ముందుకు నడిచాడు.

అశోక్ వాళ్లతోపాటు జీపు దగ్గరకు నడిచాడు.

జీపుతోపాటు వచ్చిన ఇద్దరు వ్యక్తులకూ ఏమీ అర్ధం కావడం లేదు. వాళ్లు అశోక్ వంక కోపంగా చూస్తూ శ్రీధర్‌తో ఏదో చెప్పబో యారు. కానీ శ్రీధర్ వాళ్లకా అవకాశం ఇవ్వలేదు.

అశోక్ ఆలోచనలను గ్రహించినట్టుగా శ్రీధర్ మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

''అశోక్! నీకు ఇదంతా ఆశ్చర్యంగా ఉండవచ్చు. కానీ మన రెండు కుటుంబాల మధ్య గొడవలు నీకు మొదట్నుంచీ ఇష్టం లేవని మాకు తెలుసు. మేము కూడా అప్పుడప్పుడూ అను కుంటూ ఉంటాం. 'వుయ్ షల్ ట్రై టు మేక్ అవర్ విలేజ్ ఎ బెటర్ ప్లేస్ టు లివ్ ఇన్' అని. నేనూ, లావణ్యా చాలాసార్లు ఈ విషయం గురించి చర్చించుకునే వాళ్లం. చాలా రోజులుగా నీతో మాట్లా డదామనుకుంటూ సమయం కోసం ఎదురు చూస్తున్నాం. ఈరోజు అనుకో కుండా ఇలా కలిసాం. మన కుటుం బాల మధ్య వున్న పరిస్థితుల్లో కలసి ఆనందంగా వుండడం అన్నది ఎప్ప టికీ సాధ్యపడే విషయం కాదని అను కునే వాళ్లం. కానీ ఇప్పుడు మాత్రం ఇదంతా సాధ్యమేనని నమ్మకం కలుగు తోంది. అసలు ఈ ఆలోచనకంతా ఒక రూపం ఇచ్చి, నాకు ధైర్యం చెప్పి నీతో మాట్లాడించటానికి, ఇప్పుడు మనం ముగ్గురం కలిసి ఒకే జీపులో ప్రయా ణించటానికి కారణం మాత్రం మా లావణ్యే. ఈ క్రెడిట్ అంతా ఆమెకే చెందుతుంది'' అంటూ ముగించాడు.

అశోక్ లావణ్య వంక చూశాడు. ఆమె అతనివంకే చూస్తోంది. అదే చూపు. అయితే ఈసారి ఆమె సిగ్గుపడుతున్నట్టుగా చిన్నగా నవ్వింది. ఆమె నవ్వుకూ ఆ చూపుకి అర్ధం అతనికి అప్పుడు తెలిసింది.

అంతేకాదు తనతోపాటు ఆవూరి వాళ్లంతా ఎదురుచూస్తున్న రోజు, శ్రీధర్ అన్నట్టుగా ఆ వూరు 'బెటర్ ప్లేస్' అయ్యేరోజు ఎప్పుడు, ఎలా వస్తుందో కూడా అతనికి తెలిసింది.

అతని హృదయం అతనికే తెలియకుండా ఆమెకు స్వాగతం పలికింది.

బంతులూ, చేమంతులూ వీళ్లకు స్వాగతం చెబుతుండగా ఆ వూరికి నిజమైన పండుగ రాబోతోందనే ఆశను రేపుతూ జీపు వూళ్లోకి ప్రవేశించింది. ★